సాక్షి

ఏలూరు

గురువారం । 15 । ఆగస్టు । 2024



స్కూల్ బస్సుల తనిఖీ

ఏలూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో స్కూల్ బస్సులు తనిఖీలు చేసి 63 కేసులు నమోదు చేసినట్లు డీటీసీ శాంతకుమారి చెప్పారు. IIలో ▸



పోరాట ఝరి.. గోదావరి

స్వాతంత్ర్య సంగ్రామంలో గోదావరి జిల్లాలకు చెందిన ఎందరో మహానుభావులు వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. IIలో ▸



ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు రైతు

ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో అతిథిగా పాల్గొనేందుకు ఏలూరు జిల్లాకు చెందిన సామాన్య రైతు పొట్టిపోతుల పోతురాజుకు ఆహ్వానం అందింది. IIలో ▸

న్యూస్‌రీల్

'గవర్నర్ ఎట్ హోమ్'కు శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం



కలెక్టర్ వెట్రిసెల్విని కలిసిన డి.శ్రీనివాసరెడ్డి

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య దినోత్సవం రోజు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారి గౌరవార్థం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ నిర్వహిస్తున్న 'ఎట్ హోమ్' కార్యక్రమానికి ఏలూరు దత్తాత్రయం రోడ్డులో ఉన్న పరివర్తన్ ప్రత్యేక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస రెడ్డికి గవర్నర్ నుంచి ఆహ్వానం అందింది. ఎట్ హోమ్ కార్యక్రమానికి మొత్తం 19 మందిని ఆహ్వానించారని వారిలో తాను ఒకడిగా ఉండటం గర్వకారణంగా ఉందని శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఆహ్వానితుల్లో పద్మశ్రీ గ్రహీతలు, ఒలింపిక్స్‌లో పాల్గొన్నవారితో పాటు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారు ఉన్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు చేరుకోవాలని రాజ్‌భవన్ పంపిన ఆహ్వాన పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. పరివర్తన్ పాఠశాల ద్వారా దివ్యాంగులకు చేస్తున్న సేవలకు తనను ఎంపిక చేసి ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి బుధవారం కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా

ఏలూరు (మెట్రో): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని సంబంధిత వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో లావాదేవీలు పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సహకార శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో పెద్ద సంఖ్యలో మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీలు, ప్రైమరీ ఫిషరీ సొసైటీలు, డెయిరీ కో-ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులతో చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రీన్ ఫీల్డ్ 365 హైవే నిర్మాణంలో వెంకటాపురం గ్రామ పరిధిలో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ ప్రతిపాదన నిమిత్తం బ్రిడ్జి నిర్మాణ విషయంలో సమస్యపై ఎన్‌హెచ్ ఖమ్మం, ఇరిగేషన్ ఎస్ఈ విస్సన్నపేట తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం



వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలబడడంలో అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సరిపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త జిట్టా వెంకటేశ్వరరావుకు పార్టీ ద్వారా వచ్చిన చెక్కును బాలరాజు బుధవారం అందజేశారు. వెంకటేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన కూటమి శ్రేణులు సుమారు రెండు నెలల క్రితం దాడులు చేయడంతో తీవ్రంగా గాయపడిన విషయం పార్టీ అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్త ఆర్థిక అవసరాల నిమిత్తం చెక్కును అందజేశారని, అతని కుటుంబానికి అండగా నిలబడాలని అధినేత ఆదేశాలు జారీ చేశారన్నారు. మాజీ ఎంపీటీసీ మట్టా సత్యనారాయణ, గ్రామ కన్వీనర్ మందపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కోసం వచ్చి క్యూలో అవస్థలు పడుతూ నిరీక్షిస్తున్న గర్భిణులు



ఉదయం 11 గంటలు దాటినా ఖాళీగా పురుషుల ఓపీ వైద్యుడి కుర్చీ



స్కానింగ్ కేంద్రానికి స్ట్రెచర్‌పై రోగిని తీసుకువెళుతున్న బంధువులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఓపిక పట్టలేక.. వైద్యం అందక

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కనీస వైద్యం అందక రోగులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రిగా వర్గోన్నతి పొందితే... అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని జనం పెట్టుకున్న ఆశలు అడియాశలుగా మారాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా వందలాదిమంది పేదలు వైద్యం కోసం ఏలూరు జీజీహెచ్‌కు వస్తుంటారు. కానీ ఈ ఆసుపత్రిలో రోగులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అత్యవసర వైద్య సేవల్లోనూ నిర్లక్ష్యం తాండవిస్తుండటంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో మూడు గంటల పాటు ప్రజలకు అందుతున్న వైద్యసేవల పరిస్థితులపై 'సాక్షి' బృందం గ్రౌండ్ రిపోర్ట్..

వైద్యానికి సుస్తీ

- ఏలూరు జీజీహెచ్‌లో అరకొర వైద్యసేవలు
- ప్రతిరోజూ ఓపీకి 1000 మంది రోగులు
- వైద్యుల కోసం లైన్‌లో గంటల తరబడి నిరీక్షణ
- వైద్య పరీక్షలు చేసే విభాగాల్లోనూ ఇదే పరిస్థితి
- గర్భిణులు, బాలింతలకూ తప్పని అవస్థలు
- పరిమితంగా, అధ్వాన స్థితిలో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు
- రోగుల బంధువులే వీల్‌చైర్ సహాయకులు
- ఎంఆర్ఐ స్కానింగ్‌కు 20 రోజులు ఆగాల్సిందే
- అత్యవసర వైద్య సేవలపై చేతులెత్తేస్తోన్న వైనం



సాక్షి ప్రతినిధి, ఏలూరు/ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వైద్యం కోసం రోగులు వస్తుంటారు. ముఖ్యంగా పేదవర్గాల ప్రజలకు ఏలూరు సర్వజన ఆసుపత్రి గుండెలాంటిదనే చెప్పాలి. (ఈ నెల 12వ తేదీ) సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వందల సంఖ్యలో రోగులు ఓపీకి వచ్చారు. ఆయా ఓపీ విభాగాల వద్ద రోగులు బారులు తీరి నిలబడి ఉన్నారు. కనీసం గంట, గంటన్నర నిరీక్షిస్తేనే గానీ డాక్టర్ వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. వృద్ధులు, వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారి వేదన అయితే వర్ణణాతీతంగా ఉంది. సుమారుగా 800 నుంచి 1000 మంది రోగులు ఓపీకి రాగా, అత్యవసర విభాగంలో మరో 200 మందికి పైగా రోగులు, క్షతగాత్రులు, వైద్యం కోసం వచ్చారు. వర్షాకాలం కావటంతో జ్వరపీడితులతో హాస్పిటల్ మరింత రద్దీగా మారింది.

గర్భిణుల కష్టాలు వర్ణనాతీతం

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని తల్లిబిడ్డా విభాగంలో గర్భిణుల పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయి. ద్వారకాతిరుమల ప్రాంతానికి చెందిన భాగ్యశ్రీ అనే గర్భిణి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఎంసీహెచ్ బ్లాక్‌కు వచ్చింది. నిండు



ఏలూరు జీజీహెచ్‌లో జనరల్ ఓపీ విభాగంలో డాక్టర్ కోసం వేచి ఉన్న రోగులు

గర్భిణి కావటం, ఉమ్మనీరు సమస్యతో బాధపడుతున్న ఆమెను వైద్యులు స్కానింగ్ తీయించుకోవాలని సూచించారు. బాగా నీరసంగా ఉన్న ఆమె స్కానింగ్ విభాగానికి వెళ్లలేక వీల్‌చైర్ కోసం ఎదురుచూసినా లభించకపోవడంతో నొప్పి భరించలేక రోదించింది. పక్కన ఉన్న తల్లి ఆమెను ఓదార్చుతూ నడిపించుకుంటూ ఎక్కడో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు తీసుకువెళ్లటం సమస్యకు అద్దం పడుతోంది. హాస్పిటల్‌లో సహాయక సిబ్బంది ఏమి చేస్తున్నారో తెలియని గందరగోళం నెలకొంది. పదుల సంఖ్యలో నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది ఉన్నా వారంతా తమకేమీ పట్టనట్లు ఉండటంపై రోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సొమ్ములిస్తే వెంటనే ఎంఆర్ఐ స్కానింగ్

ఇక ఈ ఆసుపత్రికి తీవ్ర అనారోగ్యంతో వచ్చే రోగికి వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ చేయించాలని రాస్తే ఆ రోగి ప్రాణం.. గాల్లో దీపం చందంగా మారుమారుతోందనే వాదన వినిపిస్తోంది. రమేష్ అనే తాపీమేస్త్రి పనిచేస్తూ పడిపోవటంతో వెన్నుముకలో తీవ్రమైన నొప్పితో జీజీహెచ్‌కు వచ్చాడు. అతడ్ని పరీక్షించిన వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకోవాలని చెప్పారు. దీంతో ఆ విభాగం వద్దకు వెళ్లగా, ఓపీ చీటి చూసిన సిబ్బంది ఈనెల 29న వస్తే స్కానింగ్ చేస్తామని చెప్పారు. అయితే అప్పటి వరకు తాను నొప్పి భరించలేనని చెప్పగా రూ.3,500 చెల్లిస్తే వెంటనే స్కానింగ్ తీస్తామని చెప్పడంతో ఆవేదనకు గురయ్యాడు. ఎంఆర్ఐ స్కానింగ్‌కు కనీసం 15 రోజుల నుంచి 25 రోజుల గడువు విధిస్తుండటంతో వారికి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ ప్రైవేటు కంపెనీకి చెందినది కావటం, రోజుకు 15 మందికి మాత్రమే స్కానింగ్ తీసే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు.

బంధువులే వీల్‌చైర్లలో తీసుకువెళుతూ..

- ఏలూరు నగరానికి చెందిన వెంకటేశ్వరమ్మ అనే మహిళ విషజ్వరంతో హాస్పిటల్‌కు వచ్చింది. 60 ఏళ్ల పైబడి వయస్సు ఉన్న ఆమె నడవలేని స్థితిలో ఉంది. హాస్పిటల్ సిబ్బంది తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా ఉండగా కుమారుడే వీల్‌చైర్‌ను తెచ్చి ఆమెను కూర్చోపెట్టి వైద్యుడు వద్దకు, రక్తపరీక్ష విభాగాలకు తీసుకువెళ్లాడు.
- మరో వృద్ధురాలిని కుమార్తె నాగమణి వీల్‌చైర్‌లో కూర్చోబెట్టుకుని వైద్యుని వద్దకు తీసుకువెళుతూ కనిపించింది.
- వెంకటేశ్వరరావు అనే 59 ఏళ్ల కూలి పనులు చేసుకునే వ్యక్తి పెదవేగి మండలం నుంచి వైద్యం కోసం ఆస్పత్రికి రాగా, వైద్య సేవలు ఎలా పొందాలో తెలియక అయోమయంగా తిరుగుతూ కనిపించాడు.
- జంగారెడ్డిగూడెం ప్రాంతం నుంచి వచ్చిన ఓ వృద్ధుడు లేవలేని స్థితిలో ఉండగా బంధువులే స్ట్రెచర్‌పై ఎంఆర్ఐ స్కానింగ్‌కు తోసుకుంటూ తీసుకువెళ్లారు.



ఓపీ కోసం బారులు తీరిన మహిళలు

అత్యవసర సేవలు మృగ్యం

ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర సేవలు కరువయ్యాయి. ప్రభుత్వం సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవటంతో తామేమీ చేయలేమని వైద్యులు చేతులెత్తేస్తున్నారు. ఐసీయూ, ట్రామాకేర్, అత్యవసర సేవలకు సంబంధించి సుమారుగా 50కిపైగా బెడ్లు అందుబాటులో ఉన్నా అత్యవసర వైద్యం అందించడంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఇటీవల మినీబైపాస్‌లో రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి కాలు విరిగి, తలపై గాయమైంది. వెంటనే విజయవాడ తరలించాలని రిఫర్ చేసేశారు.



ఆక్సిజన్ ప్లాంట్

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్లు

కరోనా విపత్తు సమయంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏలూరు జీజీహెచ్‌లో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసింది. సుమారుగా రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 5,500 లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లు నేడు నిరుపయోగంగా మారాయి. కానీ ఇదే ఆవరణలో మరో 10 వేల లీటర్ల ఆక్సిజన్ ప్లాంట్ ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండటం గమనార్హం.



తల్లిని వీల్‌చైర్‌లో తీసుకువెళుతున్న కుమార్తె

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ఏలూరు ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో యువత, ప్రజలు దేశ అభ్యున్నతికి పాటుపడాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఏలూరు నగరంలో బుధవారం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇండోర్‌స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ శివకిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. మోటారు సైకిల్ ర్యాలీలో యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను జాతి మరువదని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కోరారు. యువత, విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జెండా పండగకు ముస్తాబు

ఏలూరు టౌన్: స్వాతంత్ర్య వేడుకలకు ఏలూరు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. మువ్వన్నెల జెండాలు, రంగవల్లులు, రకరకాల పూలతో అలంకరించే పనిలో పోలీస్ సిబ్బంది నిమగ్నమయ్యారు. గురువారం నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకునేందుకు అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రభుత్వ శాఖల విశిష్ట సేవలను ప్రదర్శించేలా శకటాలు, పోలీస్ సిబ్బంది కవాతు, గౌరవ వందనం, పోలీస్ డాగ్ విన్యాసాలు ఇలా ప్రజలకు దేశభక్తిని చాటేలా ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్‌కు విద్యుత్ కాంతులతో అలంకరించారు. త్రివర్ణ రంగులతో కలెక్టరేట్ ధగదగలాడుతోంది.

జాతీయ పతాకం ఆవిష్కరించనున్న మంత్రి పార్థసారథి

ఏలూరు (మెట్రో): ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హాజరై పతాకావిష్కరణ చేయనున్నారు.

● త్రివర్ణ కాంతులు



త్రివర్ణ విద్యుత్ కాంతుల ధగధగల్లో ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం





ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సిద్ధమవుతున్న వేదిక, స్వాగతద్వారం ఏర్పాట్లలో పోలీస్ సిబ్బంది

క్లుప్తంగా

ధాన్యం సొమ్ములు ఇప్పించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ఏలూరు (టూటౌన్): దళారుల చేతిలో మోసపోయిన రైతులకు ధాన్యం బకాయి సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పి.జమలయ్య మాట్లాడుతూ నూజివీడు మండలంలోని సుంకొల్లు, పడమట దిగవల్లి, అన్నవరం, సూరేపల్లి, ముక్కొల్లుపాడు, చాత్రాయి గ్రామాలకు చెందిన రైతులు 116 మంది అన్నవరానికి చెందిన మల్లూరు వెంకట నాగచంద్రశేఖర్, అతని సోదరుడు సురేష్‌కు ధాన్యం విక్రయించి మోసపోయారని తెలిపారు. మంత్రి పార్థసారధికి రైతులు వినతి పత్రం అందజేసిన సందర్భంలో.. ఈ సమస్యను పరిష్కరించలేమని పోలీసులు మంత్రిని పక్కదారి పట్టించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కలప స్వాధీనం



కొయ్యలగూడెం మండలం పొంగుటూరు సమీపంలో స్వాధీనం చేసుకున్న వాహనం

కొయ్యలగూడెం: అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఫారెస్ట్ రేంజర్ కె.కృష్ణకుమారి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాజవరం నుంచి కొయ్యలగూడెంకు బొలెరో వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పొంగుటూరు సమీపంలో వాహనం అతివేగంగా వెళ్తుండగా గుర్తించి అనుమానంతో ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పాడని.. దీంతో ట్రక్కుపై కప్పి ఉంచిన కవర్ తొలగించగా అక్రమ కలప బయటపడిందన్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

ముసునూరు: ఎరువులు, పురుగు మందులు అక్రమ నిల్వలు ఉన్నాయనే సమాచారంతో విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు చేసి, కేసులు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి మధుమోహన్ తెలిపారు. ముసునూరులోని అమృత ట్రేడర్స్‌లో బుధవారం సాయంత్రం ఇరు శాఖల అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో రూ.23,68,485 విలువైన 16,121 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి, సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. రూ.1,64,000 విలువైన 194 లీటర్ల నిషేధిత గ్లెఫోసెట్ కలుపు మందులు గుర్తించి, సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసు నమోదు

టి.నరసాపురం: బంగారు ఆభరణాల చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని కె.జగ్గవరానికి చెందిన తెలే కృష్ణ ఈ నెల 13న ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్ళాడు. తిరిగి మధ్యాహ్నం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రెండు బంగారపు ఉంగరాలు, చెవి రింగులు, రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోరాట ఝురి.. గోదావరి

- బ్రిటీష్ పాలకులపై గర్జించిన అలనాటి యోధులు
- ఉమ్మడి పశ్చిమలో ఉవ్వెత్తున స్వాతంత్ర్యోద్యమం

కైకలూరు/తాడేపల్లిగూడెం: బ్రిటీష్ దాస్య శృంఖలాల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి ఎందరో వీరులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారు. అలాంటి వారిలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ ఫిరంగులకు రొమ్ము ఎదురొడ్డి ఆంధ్రుల సత్తాను చాటారు. మహనీయుల పిలుపులకు ఎందరో ప్రేరణ పొంది.. తుపాకీలు గురిపెట్టినా, లాఠీలు ఎక్కుపెట్టినా వెరవకుండా పోరాటం చేశారు. తెగువను ప్రదర్శించడంలో మగువలు వీర ఝాన్సీలయ్యారు.



తిరుగుబాటు చేసిన వీరులను ఉరి తీసిన పాత పోలవరం దివానం భవనం



పాత పోలవరంలో బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్న రెడ్డిరాజుల భవనం

పోరాట యోధులు కృష్ణమూర్తి, అంజిలక్ష్మి



పసల కృష్ణమూర్తి



పసల అంజిలక్ష్మీ

పోరాట యోధులంటే ఇలా ఉండాలని గుర్తింపు పొందారు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పసల కృష్ణమూర్తి, అంజిలక్ష్మి దంపతులు. తాడేపల్లిగూడెం సమీపంలోని పడమర విప్పర్రులో 1900లో కృష్ణమూర్తి, తణుకు సమీప కుమరపల్లిలో 1904న అంజిలక్ష్మి జన్మించారు. 1916లో వీరికి వివాహం జరిగింది. ఇద్దరు ఆడ, ఒక మగ సంతానం. 1929 ఏప్రిల్ 25న చాగల్లు వచ్చిన గాంధీజీకి ఒంటిపైనున్న బంగారపు ఆభరణాలన్నీ ఇచ్చేశారు. కృష్ణమూర్తి జీవితాంతం బాపూజీ వేషధారణలో నడిచారు. విదేశీ వస్త్రాల బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1931లో వారిని జైలుకు పంపారు. చంకలో నాలుగేళ్ళ కుమారుడితో అంజిలక్ష్మి జైలుకు వెళ్లారు. 1932 జూన్ 27న భీమవరంలో జరిగిన శాసనోల్లంఘనలో కృష్ణమూర్తి జాతీయ జెండాను కార్యాలయంపై ఎగురవేశారు. బ్రిటీష్ పాలకులు అడ్డుకోడానికి వస్తే అంజిలక్ష్మి అడ్డుగా నిలిచారు. ఈ ఉద్యమాన్ని దక్షిణాది బార్డోలిగా పిలుస్తారు. బ్రిటీష్ ప్రభుత్వం 1932 అక్టోబరు 29న 10 నెలల జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు జైలుకు అంజిలక్ష్మిని పంపారు. జైలులో పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఆమెకు కృష్ణభారతి అని పేరుపెట్టారు. అనంతరం దంపతులిద్దరూ 60 ఎకరాల పొలాన్ని సమాజహితం కోసం ఖర్చు చేశారు. సొంత ఇంటినే ధర్మాసుపత్రిగా మార్చారు. వితంతు వివాహాలు, అంటరానితనం నిర్మూలన, దళితులకు చదువులు చెప్పించారు. అంజిలక్ష్మీ రాష్ట్రపతి నుంచి అత్యున్నత తామ్ర పత్రం అందుకున్నారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు భీమవరం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ అంజిలక్ష్మీ కూతురు కృష్ణ భారతి(90) పాదాలకు నమస్కరించారు.

బ్రిటిష్ వారిపై గిరిజనుల పోరు

బుట్టాయగూడెం: స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో గిరిజనులు బ్రిటిష్ వారిపై పోరాడారు. 1857లో యావత్ భారతదేశంలో స్వాతంత్ర్య సమరం ప్రారంభమైనప్పుడు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బ్రిటిష్ వారిపై తిరుగుబాట్లు జరిగాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం కొరుటూరుకు చెందిన కొండరెడ్డి గిరిజన తెగకు చెందిన కారుకొండ సుబ్బారెడ్డి పోలవరం పరిసరాల ప్రాంతంతో పాటు బుట్టాయగూడెం నుంచి యర్నగూడెం వరకూ ఉన్న గిరిజన గ్రామాలకు జమిందారుగా ఉండేవాడు. సుబ్బారెడ్డికి బ్రిటిష్ వారంటే ద్వేషం. యర్నగూడెంలో ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశాడు. ఆ సమయంలో గోదావరి దిగువ ప్రాంతంలో ఉన్న సుమారు 40 గ్రామాలతో బ్రిటిష్ వారిపై దండయాత్ర చేసి విజయం సాధించారు. సుబ్బారెడ్డికి ముఖ్య అనుచరుడిగా కుర్ల సీతారామయ్య ఉండేవారు. గురుగుంట్ల కొమ్మురెడ్డి, అప్పటి తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు గ్రామానికి చెందిన కుర్ల వెంకటరెడ్డిలు కలిసి తెల్లదొరలపై వీరోచిత పోరాటం చేశారు. ఆ సమయంలో సుబ్బారెడ్డి తలకు బ్రిటిష్ వారు రూ. 2,500 వెల కట్టారు. చివరకు కొందరు గిరిజనులు అతనిని వెన్నుపోటు పొడిచి కారుకొండ సుబ్బారెడ్డితోపాటు అతని అనుచరులను మరికొంత మంది విప్లవ వీరులను 1858 జూన్ 11న బ్రిటిష్ వారికి పట్టించారు. పోలవరం మండలం కొరుటూరు, తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు తదితర గ్రామాల్లో ఉన్న కారుకొండ సుబ్బారెడ్డి, కుర్లా సీతారామయ్య, కుర్లా వెంకట సుబ్బారెడ్డి, గురుగుంట్ల కొమ్మురెడ్డిలతో పాటు మరి కొంతమంది వీరుల్ని బ్రిటిష్ వారు పట్టుకుని 3 నెలల పాటు విచారించారు. విచారణ అనంతరం 8 మందిని అండమాన్ జైలుకు పంపారు. 35 మంది గిరిజన వీరుల్ని గుంటూరు దగ్గరున్న జైలులో బంధించారు. కారుకొండ సుబ్బారెడ్డి, కుర్లా సీతారామయ్యలను బుట్టాయగూడెంలో ఉరి తీశారు. మిగిలిన ఆరుగురిని పోలవరం సమీపంలో ఉన్న దివానం వద్ద ఉరి తీశారు. కారుకొండ సుబ్బారెడ్డి మృతదేహాన్ని చిన్న బోనులో పెట్టి రాజమండ్రి దగ్గర ఉన్న కోటగుమ్మం వద్ద ప్రజలు చూసేలా వేలాడదీశారు. స్వాతంత్ర్యం రావడానికి కొన్నేళ్ల ముందు వరకూ మృతదేహం వేలాడుతూ ఉండేదని పాతతరం వారు చెబుతారు.



కైకలూరులో సమరయోధుల స్మారక స్థూపం



పసల అంజిలక్ష్మీ కుమార్తె కృష్ణ భారతి(90) కాళ్లకు మొక్కుతున్న ప్రధాని మోదీ(ఫైల్)



తణుకులో యర్రమిల్లి రామనాథం భవనం

నందనం తోటలో గాంధీజీ బస



గాంధీజీ బస చేసిన నందనంతోటలోని ప్రాంతం

నూజివీడు: మహాత్మాగాంధీ 1930 ప్రాంతంలో నూజివీడు సందర్శించారు. గాంధీ నేతృత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో నూజివీడు వాసులు తమ వంతు పాత్ర పోషించారు. గాంధీజీ నూజివీడు వచ్చిన సమయంలో గాంధీనగర్‌లో ఉన్న నందనం తోట ప్రాంతంలో ఆయనకు బస ఏర్పాటు చేశారు. విక్టోరియా పురమందిరం వద్ద గాంధీజీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. బాపూజీ పిలుపుమేరకు జమిందారు ఎమ్మార్ అప్పారావు ఖద్దరు వస్త్రాలు ధరించారు.

డూ ఆర్ డై ఉద్యమం

భీమవరం పట్టణంలో క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ ముష్కరుల కాల్పుల్లో నలుగురు స్వాతంత్ర్య సమరయోధులు మృతి చెందారు. వీరిలో 9 సంవత్సరాల బాలుడు ఉన్నాడు. వేగేశ్న నారాయణరాజు, గొట్టుముక్కల బలరామరాజు, ఉద్దరాజు వెంకటరాజు, ముంత బ్రహ్మం(బాలుడు) 1942 ఆగస్టు 17న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండా ఎగురవేసేందుకు వెళ్తుండగా.. బ్రిటీష్ సైనికులు జరిపిన కాల్పులలో అసువులు బాసారు.

సమరయోధుల నిలయంగా తణుకు పట్టణం

తణుకు పట్టణం సమరయోధులకు నిలయంగా ఉండేది. కర్మయోగి బిరుదు పొందిన యర్రమిల్లి రామనాథం స్వాతంత్ర్య సమరయోధులకు ఉచిత భోజనం అందించాలనే ఉద్దేశంతో తణుకులో ప్రత్యేక భవనం నిర్మించారు. గాంధీజీ తణుకు వచ్చినప్పుడు ఆ భవనంలో ఉండమని గాంధీజీని కోరారు. కైకలూరుకు కూడా ఉద్యమానికి కేంద్రంగా ఉండేది. ఆందోళన చేసిన వారిని అరెస్టు చేసి కైకలూరు జైలుకు తరలించేవారు. అక్కడ అనేక స్మారక కట్టడాలు నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి.

19 ఏళ్ల వయసులోనే జైలుకు



ఏలూరు జిల్లా పెదపాడులో 1911లో గారపాటి సత్యనారాయణ జన్మించారు. కేవలం 19 ఏళ్ల వయసులో బ్రిటీష్ పాలకులను ఎదిరించి 1930లో జైలు జీవితం గడిపారు. సర్దార్ భగత్‌సింగ్, కన్నెగింటి హనుమంతరావు, అల్లూరి సీతారామరాజు, నీలం సంజీవరెడ్డి, ఆర్.వెంకట్రామన్‌కు సన్నిహితులు. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్‌ను ఏలూరు తీసుకువచ్చారు. తర్వాత 1951లో ఏలూరు నియోజకవర్గానికి మొదటి శాసనసభ్యుడిగా పనిచేశారు. గారపాటి 2002లో మృతి చెందారు.

'క్విట్ ఇండియా'లో చురుగ్గా



మండవల్లి మండలం కాకతీయనగర్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వుప్పాల కోదండరామయ్య, 1915లో జన్మించారు. ఆయనకు ఏడుగురు మగ, ముగ్గురు ఆడ సంతానం. ఆచార్య ఎన్‌జీ రంగాకు ప్రియశిష్యుడు. గాంధీజీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నిండిపోవడంతో తెనాలి తీసుకొచ్చి కోదండరామయ్యను బంధించారు. ఆయన 2017లో మరణించారు.

చిచ్చర పిడుగు సీర్ల బ్రహ్మయ్య



సీర్ల బ్రహ్మయ్య బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించారు. ఏలూరులో 1913 జూన్ 10న ఆయన జన్మించారు. హిందీ భాషలో పట్టభద్రుడు. 1930, 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో వలంటీర్‌గా పనిచేశాడు. అలీపూర్ జైలులో 1941లో జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం రెండుసార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం అనంతరం ఏలూరు మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా తొమ్మిదేళ్ల పనిచేశారు. ఏలూరులో పలు సాంస్కృతిక సంస్థలను నెలకొల్పారు.

స్వతంత్ర పోరాటంలో చింతలపాటి



ప్రముఖ గాంధేయవాది చింతలపాటి వర ప్రసాదమూర్తి రాజు చిననింద్రకొలనులో 1919లో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1961లో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆచార్య వినోబాబావే, జయప్రకాష్ నారాయణను రాష్ట్రానికి తీసుకొచ్చారు. 1971–1972లో రాష్ట్ర మార్కెటింగ్, దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: చొదిమెళ్ళ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు ప్రకారం.. పాలకొల్లుకు చెందిన కోతాడ తులసీవెంకట కుమార్ (31) ఏలూరులోని శ్రీరామ్‌నగర్‌లో మేనత్త వద్ద ఉంటున్నాడు. కాంట్రాక్టు పనులు చేసేవాడు. బుధవారం హనుమాన్‌జంక్షన్ వెళ్ళేందుకు ఇంటిదగ్గర బయలుదేరి.. తంగెళ్ళమూడి బ్రిడ్జి ప్రాంతంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద స్నేహితురాలిని బైక్ ఎక్కించుకున్నాడు. జాతీయ రహదారిపై కారు బైక్‌ను ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో అతను మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన యువతిని హాస్పిటల్‌కు తరలించారు. బైక్‌ను ఢీకొట్టి పరారవుతున్న కారును పోలీసులు టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. కారు పశ్చిమబెంగాల్‌కు చెందినదిగా గుర్తించారు.

విద్యా సంస్థల బస్సుల తనిఖీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న వివిధ విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేసి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంత కుమారి తెలిపారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇంతవరకూ మొత్తం 63 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ట్యాక్సులు చెల్లించకపోవడం, ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకపోవడం, పర్మిట్లు లేకుండా బస్సులు తిప్పడం, బీమా చెల్లించకపోవడం, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం, పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించడం వంటి వాటిపై కేసులు నమోదు చేసి వాటికి జరిమానా విధించామని తెలిపారు. నమోదు చేసిన 63 కేసులకు సంబంధించి మొత్తం రూ.1,44,600 జరిమానాగా విధించామని తెలిపారు.



విద్యా సంస్థ బస్సు తనిఖీ చేసి కేసు నమోదు చేస్తున్న రవాణ శాఖ అధికారులు

అంటువ్యాధులపై అప్రమత్తం

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని.. అంటువ్యాధులతో మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని డీసీజ్ కంట్రోల్ స్టేట్ అదనపు డైరెక్టర్ డాక్టర్ బీ.సుబ్రహ్మణ్యేశ్వరి చెప్పారు. ఏలూరు శివారు ఆశ్రం వైద్య కళాశాల సుశ్రుత ఆడిటోరియంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా వైద్య అధికారులు, సహాయ మలేరియా అధికారులతో జిల్లాల్లోని పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల అంటువ్యాధులతో మరణాలు ఆందోళనకరంగా ఉంటున్నాయని, భవిష్యత్తులో మరణాలను నివారించేలా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, పశ్చిమగోదావరి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవికుమార్ ఉన్నారు.



వైద్య అధికారులతో సమీక్షిస్తున్న స్టేట్ అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్లు సరిచేయాలి



జెడ్పీ సీఈఓను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను ప్రత్యేక డ్రైవ్ పెట్టి వేగవంతంగా సరిచేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు జిల్లా పరిషత్ సీఈఓ కేవీ సుబ్బారావును కోరారు. 2019 నుంచి ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను బుధవారం విడుదల చేసిన సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను కలిసి కృతజ్ఞత తెలిపారు. పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను సరి చేయడానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆన్‌లైన్‌లో అన్ని రకాల వివరాలు తెలుసుకోవడానికి సైట్ సరిగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీడీఎస్ రైస్ సీజ్

కొయ్యలగూడెం: పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు సంబంధించి వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ బుధవారం తెలిపారు. కన్నాపురం గ్రామానికి చెందిన గ్రంధి శ్రీనివాస్ తన గొడౌన్‌లో సుమారు 1.60 లక్షల విలువైన నలభై క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి ఉంచగా సివిల్ సప్లై అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారన్నారు. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉండగా మధ్యాహ్నం కన్నాపురంలో అతనిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

స్వాతంత్ర్య వేడుకలకు సామాన్య రైతు

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పరింపూడి పంచాయతీకి చెందిన పొట్టి పోతుల పోతురాజు పంద్రాగస్టు ఢిల్లీ ఎర్రకోటలో ప్రధాని చేతులమీదుగా నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణకు అతిథిగా ఆహ్వానం అందుకున్నారు. ఆదర్శ రైతుగా గుర్తింపు పొందిన ఆయన రాష్ట్రం నుంచి వేడుకలకు ఎంపికైన నలుగురు రైతుల్లో ఒకరు. తన కష్టానికి ప్రతిఫలం లభించిందంటూ పోతురాజు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సేంద్రీయ ఎరువులు వినియోగించి యాంత్రీకరణ సాయంతో అధిక దిగుబడి సాధించడం, బిందు సేద్యంతో పంటలు పండించడం, పర్యావరణహితమైన విధంగా పంటలు సాగు చేస్తున్నందుకు పీఎం కిసాన్ పథకంలో ఆయనను ఈ వేడుకలకు ఎంపిక చేశారు.

సేంద్రీయ సాగుకు తక్కువ ఖర్చు

పోతురాజు తనకున్న ఆరు ఎకరాలకు తోడు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో వరి పండిస్తున్నాన్నారు. కేవలం సేంద్రీయ సాగు పద్ధతిలో (జీవామృతం, ఘనజీవామృతం) ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమట్టి, సెనగపిండి కలిపి నిపుణుల సూచనల మేరకు పంటకు ఎరువుగా వాడుతున్నారు. ఈ విధానంలో సాధారణ వ్యవసాయానికి అయ్యే ఖర్చులో సగం పెడితే సరిపోతుందని చెబుతున్నారు. గత ఆరు సంవత్సరాలు ఈ విధానంలో పంట పండిస్తున్నారు. సాధారణ వ్యవసాయానికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చయితే సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో కేవలం రూ.20 వేలు మాత్రమే ఖర్చయిందని చెబుతున్నారు పోతురాజు. అయితే సేంద్రీయ విధానంలో దిగుబడి కొంత తక్కువే వస్తుందని అంటున్నుఆరు.

ఇప్పుడాయన కూరగాయల పెంపకంపై దృష్టి సారించారు. బీర, దొండ, అరటి పంటలు పండిస్తున్నారు. కుమారుడు ఆర్మీలో పనిచేస్తుండగా, కుమార్తె, అల్లుడు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. భార్య నాగమణితో కలిసి స్వయంగా వ్యవసాయ క్షేత్రాలలో పనులు చేసుకుంటామని తెలిపారు. తన కృషిలో ప్రధాన పాత్ర వేదభారత్ నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నిడదవోలు వినయ్ కుమార్‌కు దక్కుతుందని చెప్పారు. కొయ్యలగూడెంకు చెందిన వినయ్ కుమార్ దశాబ్దన్నర క్రితం హైదరాబాద్ వెళ్లి వేద భారత్ నెలకొల్పారు. అనంతరం ఆయన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో సేంద్రీయ సాగు చేస్తున్నారని, దానిని స్ఫూర్తిగా తీసుకొని సొంత పొలంలో వ్యవసాయ విధానాన్ని అవలంభించానని పోతురాజు చెప్పారు.



కొయ్యలగూడెంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదర్శ రైతు పోతురాజు

ఉచితంగా శిక్షణ ఇస్తా



ఔత్సాహిక రైతులు ముందుకు వస్తే వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. మా వ్యవసాయ క్షేత్రాలలో ఉపయోగిస్తున్న సేంద్రీయ వ్యవసాయ సాగు పద్ధతులపై ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తాం.
–పొట్టి పోతుల పోతురాజు, నాగమణి దంపతులు